## క్లుప్తంగా

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: వాహనచోదకులకు రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ అవగాహన కల్పించారు. జాతీయ రహదారికి అనుకొని నవభారత్, అల్లినగరం, చిలకపాలెం, కుశాలపురం బైపాస్ కూడళ్లల్లో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రాణం విలువ గుర్తించి వాహనాలు నడపాలన్నారు. ప్రమాదాలకు కారణమైన అతివేగం, హెల్మెట్ ధరించకపోవటం, మద్యం సేవించి వాహనం నడపటం, రాంగ్ రూట్ ప్రయాణం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

### దిశ యాప్‌పై అవగాహన

లావేరు: దిశ యాప్ మహిళకు ఆయుధం వంటిదని తాళ్లవలస సచివాలయం మహిళా సంక్షేమ కార్యదర్శి కామేశ్వరీ అన్నారు. మండలంలోని సుభద్రాపురం జంక్షన్ వద్ద శనివారం దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. దిశ యాప్‌ను ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయించారు. ఆపదలో ఉన్నప్పుడు మహిళలకు దిశ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

### సీఎం జగన్‌తోనే అభివృద్ధి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

జి.సిగడాం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. నడిమివలసలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, గ్రామంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ ప్రకాశరావు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ముగిసిన చండీహోమం

శ్రీకాకుళం కల్చరల్: విజయదుర్గా అమ్మవారి ఆలయ అర్చకుడు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ నేతృత్వంలో చండీహోమం శనివారం పూర్ణాహుతితో ముగిసింది. మూడు రోజులుగా జరుగుతున్న చండీ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ఇంట్లోకి దూసుకుపోయిన అంబులెన్స్!

●చిన్నారికి గాయాలు



వాహనాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని రాయివీధి సమీపంలో ఉన్న వంశధార కార్యాలయం ఎదురుగా ఓ రేకు ఇంట్లోకి అంబులెన్సు అదుపు తప్పి దూసుకుపోయింది. ఇంట్లో ఉన్న ఎవరికీ ప్రాణాపాయం కలగకపోవడంతో ప్రమాదం తప్పినట్లైంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. వంశధార క్వార్టర్స్ వెనుక ఉన్న వర్క్‌షాప్ నుంచి వస్తున్న 108 అంబులెన్సు ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించని డ్రైవరు.. అవి దగ్గరగా వచ్చేయడంతో ఒక్కసారిగా రేకుఇంటిని గుద్దేశాడు. ఆ ఇంట్లో ఉన్న గేదెల ఆదిలక్ష్మి, ఆమె మనవరాలు ప్రియ ఒక్కసారిగా ఉలిక్కిపడి బయటకొచ్చారు. అరుగులోపల వరకు వాహనం దూసుకుపోయింది. పైకప్పుగా ఉన్న రేకులు విరిగి పోయాయి. కింద గోడ కదిలిపోయింది. కిందపడిన రేకులు ప్రియ (పాప) కాలిపాదానికి గుచ్చుకుని రక్తస్రావమైంది. స్థానికులు చేరుకుని అంబులెన్సును బయటకు తీశారు. దీనిపై అంబులెన్స్ డ్రైవరు ముకుందరావు మాట్లాడుతూ.. బ్రేకులు ఫెయిలైనట్లు చెప్పారు. ఈ విషయాన్ని ట్రాఫిక్ డీఎస్పీ వద్ద ప్రస్తావించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

### మంత్రి ధర్మానను కలిసిన ఉపాధ్యాయ సంఘ నాయకులు



మంత్రి ధర్మానకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంత్రి ధర్మాన ప్రసాదరావును శనివారం పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ నాయకులు ఉరిటి రామారావు, నర్సు సోమేశ్వరరావు, మైలపల్లి పాపయ్య ఉన్నారు.

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జి.సిగడాం: ఎవరైనా ప్రభుత్వం అనుమతులు లేకుండా బాణ సంచా విక్రయిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సామంతుల రామారావు హెచ్చరించారు. మండలంలోని వాండ్రంగి, ఆనందపురం, పాలఖండ్యాం, డి.ఆర్.వలస, సర్వేశ్వరపురం తదితర గ్రామాల్లో శనివారం పర్యటించారు.

# వీసీ నియామకానికి సెర్చ్ కమిటీ

ఎచ్చెర్ల క్యాంపస్:

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నియామకానికి అన్వేషణ ప్రారంభమైంది. వీసీ ఎంపికలో కీలకమైన సెర్చ్ కమిటీ(అన్వేషణ కమిటీ)ని నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీచేశారు. త్రిసభ్య కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ నామినీగా ప్రొఫెసర్ ఎస్.ప్రభాకరరావు (శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వీసీ), వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా ప్రొఫెసర్ కె.లాల్‌కిశోర్ (జేఎన్‌టీయూ అనంతపురం పూర్వపు వీసీ), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నామినీగా ప్రొఫెసర్ శశికళ వంజారి (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్, న్యూఢిల్లీ)లను నియమించారు. ఇప్పటికే దరఖాస్తులు స్వీకరణ ముగిసింది. పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. సెర్చ్ కమిటీ ఈ దరఖాస్తులను పరిశీలించి ముగ్గురి పేర్లతో జాబితా రూపొందించి రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తారు. సమర్థత, అనుభవం ఆధారంగా వీసీని నియమిస్తారు. ప్రస్తుత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మూడేళ్ల టెర్మ్ వచ్చే ఏడాది జనవరి 18తో ముగియనున్న సంగతి తెలిసిందే.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

## ఉత్సాహంగా బాక్సింగ్ పోరు



బాక్సింగ్ పోరులో తలపడుతున్న క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో శనివారం 7వ సీనియర్స్ పురుషులు, మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా వివిధ కేటగిరిల్లో 13 మంది విజేతలగా నిలిచి పతకాలు అందుకున్నారు. అంతకుముందు ఈ పోటీలను డీఎస్ఏ చీఫ్ కోచ్ కె.శ్రీధర్‌రావు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఏ లక్ష్మణ్‌దేవ్(అను) ప్రారంభించారు.

**విజేతలు వీరే..**

వివిధ బరువు కేటగిరీల్లో జె.తారకేశ్వరరావు, సీహెచ్ సాయి, సీహెచ్ జ్ఞానేశ్వరరావు, బి.తేజ, పి.నాని బాబు, ఎం.లోకేష్, ఎస్.ఏసు, సోను సింగ్, భరత్ కుమార్, డి.మనోజ్ కుమార్, జి.భానుప్రసాద్, ఆర్.హేమంత్, మహిళా విభాగంలో కె.తేజేశ్వరి విజేతలగా నిలిచారు. వీరంతా ఈ నెల 13 నుంచి 15 వరకు విశాఖపట్నంలో జరిగే ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారు. విజేతలను శాంతి కన్వెన్షన్ ఎండీ జి.నాగరాజు అభినందించారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సీఈవో బి.వి.ప్రసాదరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, సీనియర్ కోచ్ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ రాజీవ్‌గాంధీ, సీనియర్ బాక్సర్లు సురేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

## సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కళింగ వైశ్య సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళింగ వైశ్యును బీసీ–డీ జాబితాలో చేర్చుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకొని, జీఓ జారీ చేయడం పట్ల కళింగ వైశ్య జిల్లా సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం నరసన్నపేట వైఎస్సార్ కూడలి వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కళింగ వైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ గతంలో కళింగ వైశ్యులను వైఎస్సార్ హయాంలో బీసీ జాబితాలో చేర్చారని, అది కొన్ని జిల్లాలకే పరిమితమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సీఎం జగన్‌ను కోరగా సానుకూలంగా స్పందించి తాజాగా అమలు చేశారని పేర్కొన్నారు. ఓబీసీలో చేర్చడానికి కూడా ఓబీసీ కమిషన్‌కు తగిన సమాచారం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తంగుడు జోగారావు, ప్రతినిధులు పొట్నూరు సాయి ప్రసాద్, కేసీహెచ్‌బీ గుప్త, బోయిన బాలకృష్ణ, తంగుడు నాగేశ్వరరావు, పొట్నూరు కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మహిళ మృతదేహం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని ఇందిరా విజ్ఞాన్ భవన్ షాపింగ్ కాంప్లెక్స్ వరండాలో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈమె కొన్నాళ్లుగా పరిసర ప్రాంతంలో భిక్షాటన చేస్తూ ఉండేదని చెప్పారు. మృతదేహాన్ని వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రిమ్స్ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. వివరాలు తెలిసిన వారు 6309990845 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

### బాణసంచా పట్టివేత

శ్రీకాకుళం క్రైమ్: అనుమతి లేకుండా విక్రయిస్తున్న బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. నగరంలోని రిమ్స్ ఆస్పత్రి రోడ్డు పక్కన బావాజీనగర్ ఒకటో లైన్‌లో ఓ వృద్ధుడు శుక్రవారం రాత్రి 10.15 గంటలకు అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి.. అతని వద్ద నుంచి రూ. 9 వేలు విలువైన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై ఎస్సై లక్ష్మణరావు శనివారం కేసు నమోదు చేశారు.

### ప్రజా రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ

రణస్థలం: ఈ నెల 15న చలో విజయవాడ జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు వెలమల రమణ, సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. రణస్థలంలో సీపీఎం ప్రజా రక్షణ భేరి, చలో విజయవాడ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు మహాలక్ష్మీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## గురునాథ్‌కు ఘన స్వాగతం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న గురునాథ్ యాదవ్

రణస్థలం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని జిల్లాలోని టెక్కలి నుంచి తిరుపతి వరకు పాదయాత్రగా బయలుదేరిన అఖిల భారత యాదవ మహాసభ అహిర్ సంఘం అధ్యక్షుడు, టెక్కలి వైఎస్సార్‌సీపీ నాయకుడు గద్దెబొయిన గురునాథ్ యాదవ్‌కు జే.ఆర్.పురం వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ విగ్రహానికి గురునాథ్ పూలమాల వేసి నివాళర్పించారు. గురునాథ్ మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, అటువంటి నాయకుడు మరలా సీఎం అయితే రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, ఎంపీటీసీ సభ్యుడు పి.సాయిరాం, నాయకులు దన్నాన సీతారాం, ఇ.తిరుపతిరాజు, టీకే బ్రహ్మాజీ, పిన్నింటి సత్యంనాయుడు, షేక్ సైదాల్, లంక రమణ, తదితరులు ఉన్నారు.

## అంబేడ్కర్ జాతర కరపత్రం ఆవిష్కరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ చైర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 19న ఎచ్చెర్లలో నిర్వహించనున్న అంబేడ్కర్ జాతరను విజయవంతం చేయాలని జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయి వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలోని ముచ్చునవానిపేటలో శనివారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జాతర కరపత్రాన్ని ఆవిష్కరించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బొల్ల అప్పారావు, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కల్లేపల్లి రామ్‌గోపాల్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్ పాల్గొన్నారు.

## ఓపీఎస్ అమలు చేయాలని వినతి



ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

రణస్థలం: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దుప్పల శివరామ్‌ప్రసాద్‌కోరారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. శివరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానానికి జీపీఎస్ ప్రత్యామ్నాయం కాదని, సీఎం జగన్ ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీని నెలబెట్టుకునేలా పాత పెన్షన్ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జీఓ 117ను రద్దు చేయాలన్నారు. రాజపు శ్రీనివాసరావు, చిన్నికృష్ణ, రామారావు పాల్గొన్నారు.

## బీసీ రథయాత్రను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): హక్కుల సాధన కోసం డిసెంబర్ ఏడో తేదీన నిర్వహించనున్న బీసీల రథయాత్రను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతి రావు కోరారు. శ్రీకాకుళంలోని ఎన్జీవోహోమ్‌లో శనివారం సంఘం కార్యవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 15న రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గం సభ్యులతో కలిసి కంపోస్ట్ కాలనీలోని యాదవ సామాజిక భవనంలో బీసీ రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తామన్నారు. శ్రీకాకుళంలో జరగబోయే రథయాత్రకు రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, 139 బీసీ కులాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు బాడాన దేవభూషణరావు, బుడుమూరు రాజేష్, కాయితి వెంకటరమణ, పాలిన ప్రసాద్, గద్దిబోయిన కృష్ణ, ఇప్పిలి చిన్నారావు, మూల నారాయణ, కర్రి రంగాజీదేవ్, కాళ్ల వెంకటరావు, రౌతు శంకరరావు ఉన్నారు.

## సంజీవరాయునికి 50 తులాల వెండి సేకరణ

శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలోని బాయమ్మతోటలో సఖియా మఠం నిర్వహణలో ఉన్న సంజీవరాయ స్వామి దేవాలయంలో స్వామికి రజత కిరీటం, కవచం చేయించేందుకు పలువురు భక్తులు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా 50 తులాల వెండిని వితరణ చేసినట్లు విశ్వ జయం గ్రూపు ప్రతినిధి కాశిని వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. వీటిని చేయించడానికి 130 తులాల వెండి అవసరం ఉంటుందన్నారు. శని త్రయోదశి సందర్భంగా స్వామికి అర్చకులు ఈదరపు వెంకట ప్రశాంత్ శర్మ, తుమరాట సందీప్‌లచే పూజలు చేశారు. స్వామికి నూతన వస్త్రాలను చలపాక హేమశ్రీనివాస్ దంపతులు సమర్పించారు. ఆలయ ధర్మకర్త పూర్ణచంద్ర దాస్, యు.త్రినాథరావు తదితారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ



విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికలు గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ అండర్ –14, 17, 19 విభాగాల్లో సత్తా చాటారు. అండర్ –14లో బాల్ బ్యాడ్మింటన్‌లో జె.దీపిక (7వ తరగతి), ఎం.అస్మిత (8వ తరగతి) రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారం, అండర్–19లో పద్మశ్రీ (10వ తరగతి), టి.భవాని (8వ తరగతి) ద్వితీయ స్థానంలో నిలిచి రజిత, అండర్–17లో ఎస్.నందిని (ఇంటర్మీడియట్), కె.ధనశ్రీ (9వ తరగతి), తృతీయ స్థానంలోని నిలిచి కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థినులను శనివారం పాఠశాలలో ప్రిన్సిపాల్ బి.లక్ష్మి, పీడీ కె.పద్మావతి, పీఈటీ ఆశాజ్యోతి, అధ్యాపకులు అభినందించారు.

## రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు మండలంలోని డి.బొండపల్లి (డి.ఆర్.వలస) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న శంభాన కార్తీక్ (17) ఎంపికయ్యాడని హెచ్ఎం కూర్మినాయుడు శనివారం తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడన్నారు. ఈ నెల 15 నుంచి 17 తేదీ వరకు నంద్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని పీడీలు రాజ్యలక్ష్మి, బెనర్జీ తెలిపారు. విద్యార్థిని సర్పంచ్ కుమరాపు శాంతమ్మ, ఎంపీటీసీ సభ్యులుడు రమేష్‌నాయుడు, ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కుమరాపు లక్ష్మణరావు, బి.కృష్ణం నాయుడు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## సమగ్ర భూ సర్వేతో మేలు

లావేరు: సమగ్ర భూముల రీసర్వేతో రైతులుకు మేలు జరుగుతుందని మండల సర్వేయరు చిరంజీవి కుమార బెహరా, తామాడ పంచాయతీ మాజీ సర్పంచ్ పాలిశెట్టి మధుబాబు అన్నారు. మండలంలోని తామాడలో శనివారం సమగ్ర భూ సర్వే ప్రారంభించారు. అనంతరం డ్రోన్ కెమెరా ద్వారా గ్రామంలో గల రైతుల పొలాలుకు ఫోటోలు తీశారు. రైతుల సమక్షంలో సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులు సర్వేకు సహకరించాలన్నారు. తామాడ మాజీ ఎంపీటీసీ రఘుమండల కృష్ణ, వీఆర్‌ఓ శ్రీనివాసరావు, సర్వేయరు వినోద్, పంచాయతీ కార్యదర్శి సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్ము సాయికుమార్, మల్లిబాబు, ఎంపీటీసీ ఆర్.నారాయణరావు పాల్గొన్నారు.

## విద్యకు దిక్సూచి మౌలానా అబుల్ కలాం ఆజాద్



ఆజాద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: భారతీయ విద్యా సాంకేతిక అభివృద్ధికి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ తొలి విద్యాశాఖామంత్రిగా ఎనలేని కృషి చేశారని ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ వహాబ్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణ రావు అన్నారు. శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో అబుల్ కలాం అజాద్ 135వ జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విగ్రహదాత మహిబుల్లాఖాన్‌తో పాటు అతిథులు, నిర్వాహకులు మౌలానా విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ బాటలో మౌలానా నడిచారన్నారు. ఈ సందర్భంగా అవధాన పండితులు పైడి హరనాధరావు మౌలానా కీర్తిని పద్యం రూపంలో వినిపించారు. కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు, నిర్వాహకులు డాక్టర్ జామి భీమ శంకర్, నటుకుల మోహన్, నిక్కు అప్పన్న, మెట్ట అనంతభట్లు, పందిరి అప్పారావు, డాక్టర్ బాడాన దేవభూషణరావు, గుత్తు చిన్నారావు, సయ్యద్ రఫీ, తర్లాడ అప్పలనాయుడు, మాజీ సైనికుల సంఘం ప్రతినిధి పద్మావతి, ఐ.మోహనరావు, సత్యనారాయణ ఉన్నారు.

### ఆయుర్వే వైద్య శిబిరానికి స్పందన

శ్రీకాకుళం కల్చరల్: ఆయుష్ శాఖ నేతృత్వంలో ప్రభుత్వ ఆయుర్వేద హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో పి.ఎన్.కాలనీలోని పార్కులో శనివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పి.జగదీష్ మాట్లాడుతూ.. ఆయుష్ శాఖ వారిచే నడపడుతున్న ఆయుర్వేద వైద్య శాలలో అన్నిరకాల రోగాలకు మందులు ఉచితంగా అందిస్తున్నామన్నారు. కీళ్లవాతం, గ్యాస్ట్రిక్ సంబంధిత వ్యాధులు, చర్మరోగాలు, శ్వాసకోశ తదితర వ్యాధులకు వైద్యసేవలు అందిస్తామన్నారు. వైద్య శిబిరంలో 40 మందికి పరీక్షలు చేసి మందులు అందచేశారు. మున్సిపల్ ఈఈ సుగుణాకర్, కాంపౌండర్ జె.చంద్రశేఖర్, యోగా ట్రయినర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

### మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘనంగా నివాళి



ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న తిప్పేస్వామి

శ్రీకాకుళం క్రైమ్: దేశంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషిచేసిన మహనీయుడు, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని జిల్లా అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి అన్నారు. ఆజాద్ 135వ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత దేశ తొలి విద్యాశాఖామంత్రిగా పనిచేశారని, ఆయన అడుగుజాడల్లో అంతా నడవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.వాసుదేవ్, ఆర్ఐ ఉమామహేష్ ఉన్నారు.

**కలెక్టరేట్‌లో..**

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారత రత్న, తొలి కేంద్ర విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు పిలుపునిచ్చారు. మైనారిటీ సంక్షేమ శాఖ, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచనల మేరకు శనివారం కలెక్టరేట్‌లో ఆజాద్ జయంత్యుత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ రఫీ, జామా మసీద్ ప్రెసిడెంట్ మహిబుల్లా ఖాన్, క్రిస్టియన్ మైనార్టీ ప్రతినిధి జీవన్, జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ జిరాజుద్దీన్, జిల్లా మైనార్టీ ప్రెసిడెంట్ ఎం.ఎ.బేగ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆదిత్యుని సన్నిధిలో వైజాగ్ రేంజ్ కమాండెంట్

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని విశాఖపట్నం రేంజ్ హోంగార్డు విభాగ కమాండెంట్ యు.రామ్మోహనరావు కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. పోలీస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### స్కూల్‌గేమ్స్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటారు. ఈ సీజన్‌తో దాదాపు అన్ని క్రీడాంశాల్లోను మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్–14 బాలబాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు విజయవాడ వేదికగా ఈ నెల తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు జరిగాయి.

### ముగిసిన నాంది ఫౌండేషన్ శిక్షణ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా జరిగిన నాంది ఫౌండేషన్ శిక్షణ శనివారంతో ముగిసింది. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సహకారంతో నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధి నైపుణ్య శిక్షణ కార్యక్రమం జరిగింది. కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులకు ఉపయోగ పడే ఇలాంటి శిక్షణ కార్యక్రమం శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి కాకినాడ ఆదిత్య కాలేజీలో నిర్వహించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో నాంది ఫౌండేషన్ జోనల్ హెడ్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.